# సీసీఐ కొనుగోళ్లు @ 12 వేల క్వింటాళ్లు

- ఖమ్మంలో మందకొడిగా సీసీఐ పత్తి కొనుగోళ్లు
- జిల్లా వ్యాప్తంగా 10 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- పత్తి పంటకు సీసీఐ మద్దతు ధర క్వింటాకు రూ.7 వేలు



సీసీఐ కేంద్రానికి రైతులు తీసుకువచ్చిన పత్తిపంట (ఫైల్)

ఖమ్మం వ్యవసాయం, డిసెంబర్ 8: భారత పత్తి సంస్థ (సీసీఐ) ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 12,590 క్వింటాళ్ల పత్తిపంటను కొనుగోలు చేసింది. కలెక్టర్ వీపీ గౌతమ్ అదేశాల మేరకు కొద్ది రోజుల క్రితమే జిల్లా మార్కెటింగ్ శాఖ జిల్లాలో 10 సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పరిధిలో మూడు, మధిర ఏఎంసీ పరిధిలో మూడు, మద్దులపల్లి ఏఎంసీ పరిధిలో రెండు, నేలకొండపలి, వైరా ఏఎంసీల పరిధిలో ఒక్కోటి చొప్పున కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో జీఆర్ఆర్ జిన్నింగ్ మిల్ సెంటర్‌లో 1,469 క్వింటాళ్లు, అమరావతి టెక్స్‌టైల్స్ జిన్నింగ్ మిల్లులో 2,162 క్వింటాళ్లు, మంజీత్ కాటన్ మిల్ సెంటర్‌లో 1,381 క్వింటాళ్లు, శ్రీశివ కాటన్ మిల్లులో 887 క్వింటాళ్లు, ఉషశ్రీ కాటన్ మిల్లులో 2,235 క్వింటాళ్లు, ఎంఎస్ స్టప్లర్చ్ జిన్నింగ్ మిల్లులో 793 క్వింటాళ్లు, అలాగే, జీఆర్ఆర్ జిన్నింగ్ మిల్లు ద్వారా 2,604 క్వింటాళ్లు, శ్రీభాగ్యలక్ష్మి కాటన్ మిల్లు ద్వారా 1,056 క్వింటాళ్లను సీసీఐ బయ్యర్లు కొనుగోలు చేశారు. మొత్తం పది కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటిలో రెండు సీసీఐ కేంద్రాల్లో శుక్రవారం నాటికి క్రయవిక్రయాలు ప్రారంభం కాలేదు. మిగిలిన 8 కేంద్రాల్లో మాత్రమే సీసీఐ ఖరీదుదారులు పంటను కొనుగోలు చేస్తున్నారు. ఏటా ప్రారంభం నుంచి చివరి వరకు సీసీఐ సుమారుగా లక్ష క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేస్తుంటుంది. అయితే, ఈ ఏడాది శుక్రవారం నాటికి సీసీఐ 12 వేల క్వింటాళ్ల పంటను మాత్రమే కొనుగోలు చేసింది. ప్రస్తుతం మార్కెట్ యార్డుల్లో పత్తిపంటకు గరిష్ట ధర క్వింటాకు రూ.6,300 పలుకుతోంది. సీసీఐ మాత్రం ఈ సంవత్సరం మద్దతు ధరను క్వింటాకు రూ.7 వేలు నిర్ణయించి పంటను కొనుగోలు చేస్తోంది. ప్రైవేటు కంటే సీసీఐలోనే మంచి ధర ఉన్నప్పటికీ ఆ స్థాయిలో పంట కొనుగోళ్లు జరగడం లేదని రైతులు చెబుతున్నారు. ఒకవైపు అనేక నిబంధనలు, మరోవైపు సీసీఐ కొర్రీల కారణంగా సీసీఐ కేంద్రాలకు రైతులు పంటను తీసుకరావడానికి ఆసక్తి చూపట్లేదు. దీనికితోడు కొద్ది రోజుల నుంచి తేమశాతం పడిపోవడంతో పంట నాణ్యతా ప్రమాణాలు సీసీఐ నిబంధనలకు అనుగూణంగా ఉండడం లేదు. ప్రస్తుతం పొడి వాతావరణం నెలకొనడంతో తిరిగి సీసీఐ కొనుగోళ్లు జోరందుకునే అవకాశం కన్పిస్తోంది.

# పార్టీ మారే ప్రసక్తే లేదు



- ప్రజల పక్షాన నిలబడి పోరాడుతా..
- బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా
- విలేకరుల సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

చర్ల, డిసెంబర్ 8 : పార్టీ మారే ప్రసక్తే లేదని, నాపై నమ్మకంతో గెలిపించిన ప్రజల పక్షాన నిలిచి.. నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటిసారిగా శుక్రవారం మండలంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెల్లం మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా కృషి చేస్తానని అన్నారు. ఇటీవల తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ సమస్యల పరిష్కారానికి ఎటువంటి ఆటంకం ఉండదని, ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. తన గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పార్టీ మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సోయం రాజారావు, పోలిన లంకరాజు, చర్ల సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, ఎస్టీ సెల్ నాయకుడు కాపుల నాగరాజు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న పంటల పరిశీలన

తుపాను ప్రభావంతో మండలంలో దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పరిశీలించారు. గొంపల్లి, కొత్తపల్లి ఆర్ కొత్తగూడెం, చింతకుంట, జీపీ పల్లి, వీరాపురం, లింగాపురం ప్రాంతాల్లో మిర్చి, పత్తి, వరి పంటలను పరిశీలించిన ఆయన రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలువురు రైతులు తమ గోడు వినిపించారు. చేతికొచ్చిన వరి పంట నీట మునిగిందని, మిర్చి చేల్లోకి నీరుచేరి తీవ్రంగా నష్టపోయామని వివరించారు. మీకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వానికి వివరించి.. న్యాయం జరిగేలా చూస్తానన్నారు. పంట నష్టం నివేదికను సాధ్యమైనంత త్వరగా తనకు అందజేయాలని వ్యవసాయాధికారి శివరామప్రసాద్‌కి సూచించారు. రైతులు అధైర్యపడొద్దని తెల్లం వారిని ఓదార్చారు. ఆయన వెంట పార్టీ మండల, అధ్యక్ష కార్యదర్శులు సోయం రాజారావు, పోలిన లంకరాజు, ఎంపీపీ గీద కోదండరామయ్య, చర్ల సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, కాపుల నాగరాజు, కొటేరు శ్రీనివాసరెడ్డి, కొసరాజు కుమార్‌రాజ, ఇర్పా వసంత్, సీతాపతిరాజు, గొర్ల రాజబాబు, ముప్పిడి సోమరాజు, పోలూరి సుజాత, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



దెబ్బతిన్న మిర్చి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సొసైటీ అధికారులు

# ధాన్యం కొనుగోళ్లకు రంగం సిద్ధం

- జిల్లాలో ప్రారంభమైన కొనుగోలు కేంద్రాలు
- 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు
- తడిసిన ధాన్యాన్ని ఆరబోసుకుంటున్న అన్నదాతలు

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ) : ఇటీవలి తుపాన్ కారణంగా కురిసిన వర్షాలకు ధాన్యం తడిసి ముద్దయింది. రైతులకు భారీగానే నష్టం జరిగింది. అయితే తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తుండడంతో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి. వ్యవసాయాధికారులు మాత్రం నష్టపోయిన పంటలను అంచనా వేశారు. పౌరసరఫరాల శాఖ అధికారులు ఇప్పటికే ధాన్యం కొనుగోళ్లకు రంగం సిద్ధం చేశారు. కేంద్రాలను కూడా ప్రారంభించారు. భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా 1,15,119 ఎకరాల్లో రైతులు వరి పంట వేశారు. . జిల్లాలో 150 కేంద్రాలకు గాను.. ఇప్పటికే 120 కేంద్రాలను ప్రారంభించారు. ఎన్నికల సమయం అయినందుకు ఆయా సంఘాల చైర్మన్లు, సొసైటీల సభ్యులు ఈ కేంద్రాలను ప్రారంభించారు. ఈ ఏడాది 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం గన్నీ బ్యాగులను, తేమ శాతాన్ని కొలిచే యంత్రాలను అధికారులు కల్లాల వద్ద అందుబాటులో ఉంచారు. ఐకేపీ, జీసీసీ, సొసైటీ, మార్కెటింగ్ శాఖల ద్వారా విక్రయాలు జరిపేందుకు ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లు చేసుకున్నారు.

## కొనుగోలు కేంద్రాలు ప్రారంభం..

వరి పంట విక్రయాలకు రైతులు సిద్ధం చేసుకోవడంతో ప్రభుత్వం మద్దతు ధర కూడా ఇప్పటికే ప్రకటించింది. 'ఏ' గ్రేడ్ రకానికి రూ.2,203, కామన్ రకానికి రూ.2,183 రేటును నిర్ణయించారు. అయితే, రైతులు దళారుల బారిన పడకుండా అధికారులు కొనుగోలు కేంద్రాల వద్దనే విక్రయాలు జరుపుతున్నారు. ధాన్యం ఆరబోసుకోవడానికి ప్రత్యేక స్థలాలను కూడా కేటాయించారు.

## తడిసిన ధాన్యం కొనుగోలుపై రాని స్పష్టత..

తుపాన్ ప్రభావంతో రైతులు పంటలను భారీగానే నష్టపోయారు. తడిసిన ధాన్యం కొనుగోలుపై అధికారులు ఇంకా స్పష్టత ఇవ్వలేదు. దీంతో రైతులు ఆయోమయంలో పడ్డారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.


## రెండు రోజుల్లో ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం..




జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 120 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. ఈ ఏడాది 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. రైతులకు అవసరమైన గన్నీ బ్యాగులను, తేమ శాతం నిర్ధారణ యంత్రాలను ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాం. ధాన్యం ఆరబోసుకోవడానికి ప్రదేశాలు కూడా ఉన్నాయి. కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసుకోవడానికి టార్పాలిన్లను అందుబాటులో ఉంచుతున్నాం. ధాన్యాన్ని విక్రయించే రైతులు తమ బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్‌ను, ఆధార్ కార్డును తీసుకురావాలి. **–త్రినాథ్‌బాబు, డీఎం, సివిల్ సప్లయీస్, భద్రాద్రి జిల్లా**



చాతకొండలో ధాన్యాన్ని బస్తాల్లో నింపుతున్న రైతులు




కోతలకు వచ్చిన వరి పొలాలు



అయ్యప్పస్వామి కొలువైన శబరిమలై క్షేత్రం

- ఆధ్యాత్మికతను పెంచుతున్న అయ్యప్ప దీక్షాధారణ
- సామూహిక పూజలు, భజనలతో సమైక్యతా భావం
- సంక్రాంతిరోజు ఇరుముడితో స్వామివారి దర్శనం
- జిల్లాలో ఏటేటా పెరుగుతున్న మాలధారులు

# మాలధారణం.. నియమాల తోరణం



సారపాక, డిసెంబర్ 8 : అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసం నుంచి అయ్యప్ప మాలధారుల కోలాహలం కనిపిస్తున్నది. సంక్రాంతి పండుగ వరకు ఎంతో పవిత్రత.. నిష్టలతో41 రోజులపాటు కఠిన నియమాలతో మాలధారులు దీక్ష చేపడతారు. నిత్యం పూజలతోపాటు సాయంత్రం భజనలు చేస్తూ స్వామివారిని తలుస్తుంటారు. మాల పూర్తయ్యే సమయానికి స్వాములు ఇరుముడి ధరించి శబరిమలైకు వెళ్లి అయ్యప్పస్వామిని దర్శించుకుంటారు. స్వామి దర్శనానికి ముందు 18 మెట్లు ఎక్కాలి.. ఈ మెట్లను అధిరోహించడం ద్వారా అవిద్య, అజ్ఞానం తొలగిపోయి స్వామి అనుగ్రహం లభిస్తుందని దీక్షాదారుల నమ్మకం. ఆధ్యాత్మిక, ఆరోగ్య సూత్రాల మేళవింపు.. అయ్యప్ప దీక్ష మనస్సు, శరీరాన్ని పవిత్రం చేసుకుని ఆధ్యాత్మిక చింతనతో తనను తాను మార్చుకునేందుకు 41 రోజుల దీక్ష ఉంటుంది. హరిహరసుతుడు అయ్యప్ప. ఇందులో అయ్య అంటే.. విష్ణువు. అప్ప అంటే.. శివుడి పేర్ల సంగమంతో అయ్యప్పనామం ఆవిర్భవించింది. మహిషా అనే రాక్షసుడిని సంహరించి అయ్యప్ప కేరళలోని శబరిమలైలో వెలిశాడు. దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల్లో శబరిమలై అయ్యప్ప ఆలయం ఒకటి. దీక్షలు ఆధ్యాత్మికం, మానవ విలువలను పెంపొందించుకునేందుకు దోహదపడతాయి. మాలధారణ, నల్లని వస్త్రధారణ, చన్నీటి స్నానం, విభూది, చందనం, కుంకుమలతో అలంకరించుకోవడం వంటి ఆచారాలు ఆధ్యాత్మికతకు ఉపకరిస్తాయి. శరీరంపై బస్మధారణ ఈశ్వర సంకేతానికి, నుదుటిపై మెరిసే తిరునామం విష్ణుమూర్తిని గుర్తు చేస్తుంది.

## దీక్షలో ఆరోగ్య ప్రయోజనాలు అనేకం..

41 రోజుల అయ్యప్ప దీక్ష ద్వారా మనిషి ఆరోగ్యం చాలావరకు మెరుగుపడుతుంది. భక్తిభావంతోపాటు ఆహార అలవాట్లలో మార్పుల కోసం అనేక మంది నియమ నిష్టలతో దీక్షను చేపడతారు. ఉదయాన్నే నిద్రలేవడం చైతన్యానికి ప్రతీకగా, సూర్యోదయానికి ముందే చన్నీటి స్నానంతో నాడీ వ్యవస్థ ఉత్తేజపర్చడం, నేలమీద పడుకోవడం ద్వారా వెన్నునొప్పుల సమస్యలు తగ్గిపోవడం, కండరాల పటిష్టత, రక్త ప్రసరణ వ్యవస్థ మెరుగుపడేందుకు దోహదపడుతుంది. నిత్య దీపారాధనతో మనస్సు తేలికపడి స్నేహం, ప్రేమానురాగాలు పెరుగుతాయి. పొగతాగడం, మద్యపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుంది. అయ్యప్ప దీక్ష ఆరోగ్యానికి ఆరోగ్య రక్షగా ఉంటుంది.



## మార్పునకు అవకాశం



అయ్యప్ప దీక్ష నియమాలు ఎంతో కఠినంగా ఉంటాయి. ఆధ్యాత్మిక చింతనతో మనసు ప్రశాంతంగా.. పవిత్రంగా మారుతుంది. అయ్యప్ప మాల ధరించడం ద్వారా క్రమశిక్షణ అలవడుతుంది. మనస్సు, శరీరాన్ని పవిత్రం చేసుకోవడం అయ్యప్ప మాల ధారణ ప్రత్యేకత. నిష్టతో దీక్షలు చేసేవారు ఆదర్శంగా నిలుస్తారు. గురుస్వామిగా దీక్ష ధరించిన మాలధారులకు తనవంతు నియమాలు సూచిస్తూ అయ్యప్ప దీక్ష విశిష్టతను చెబుతున్నాయి. ఇప్పటికీ 30 సార్లు అయ్యప్ప దీక్ష తీసుకున్నాను.

**–పాలెపు రామకృష్ణ, గురుస్వామి, సారపాక**

## జీవన ప్రమాణాలను పెంచుతుంది



అయ్యప్ప మాల ధరించిన దీక్షాపరుల్లో జీవన ప్రమాణాలను పెంచుతుంది. ప్రతి ఒక్కరూ తన విధిని గుర్తిస్తారు. సంఘంలో ఎలా ఉండాలో నేర్చుకుంటారు. తోటి వారిని ఎలా గౌరవించాలి.. మర్యాదపూర్వకంగా మెలగాలనేది దీక్షా నియమం నేర్పుతుంది. సమైక్యత, స్నేహభావం పెంపొందిస్తుంది. నడవడిక మెరుగుపడడమే కాకుండా ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగి దీక్ష తీసుకున్న తర్వాత ఆరోగ్యానికి రక్ష అవుతుంది.

**–రాంబాబు, గురుస్వామి, సారపాక**

## దీక్షలో ప్రశాంతత ఉంటుంది



అయ్యప్ప దీక్ష తీసుకున్న తర్వాత దీక్షా నియమాలు కఠినంగా ఉంటాయి. నిత్యం అయ్యప్ప నామస్మరణ చేస్తుండడంతో మానసిక ప్రశాంతత కలుగుతుంది. భక్తిభావం ఏర్పడుతుంది. తొలిసారి అయ్యప్ప మాల ధరించాను. కన్నెస్వామిగా ఉన్న నాలో గురుస్వాములు అయ్యప్పను చూస్తారు. 41 రోజుల దీక్షతో ఆరోగ్యంలో, ఆహార అలవాట్లతో మార్పులు చోటుచేసుకున్నాయి. అయ్యప్ప దీక్ష నియమాలతోపాటు ఆరోగ్యానికి ఎంతో ఉపకరిస్తుంది.

**–అన్వేష్‌రాజు, కన్నెస్వామి, మోరంపల్లిబంజర్**

## మానవతా విలువలు పెరుగుతాయి



అయ్యప్ప మాలధారణ ఎంతో పవిత్రమైనది. మాల ధరించడం వల్ల మనిషిలో మానవతా విలువలు పెంపొందుతాయి. 27 ఏళ్లుగా అయ్యప్ప దీక్ష తీసుకుంటున్నా. నడవడిక, ఆరోగ్యం, జీవన విధానంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా క్రమశిక్షణ అలవడుతుంది. అయ్యప్ప దీక్షాధారణ నియమాలు మనిషి ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయి.

**–కంచర్ల వీరభద్రరావు, గురుస్వామి, సారపాక**